ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 తమిళనాడు TAMILNADU
మంగళవారం 15 జూలై 2025

రాష్ట్రానికి భారీ వర్షసూచన

● రేపు, ఎల్లుండి కుండపోత ● 18న చేపలవేటపై నిషేధం

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం, పడమటి గాలుల వేగం కారణంగా రాష్ట్రంలో మంగళవారం నుండి ఆరు రోజులపాటు భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారు. 16 నుండి 17 వరకు చెన్నై సహా ఆరుజిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. ఉత్తర బంగాళాఖాతంలో ఆదివారం సాయంత్రం ఏర్పడిన అల్ప పీడనం ఉత్తర దిశగా కదులుతూ వాయువ్యదిశగా పయనించి సోమవారం వేకువజాము 5.30 గంటలకు వాయుగుండంగా మారి బంగ్లాదేశ్ సమీపంలో కేంద్రీకృతమైంది. ఈ వాయుగుండం కారణంగా పడమటి గాలుల వేగంలో మార్పుల కారణంగా రాష్ట్రంలోను, పుదుచ్చేరిలో చెదురు మదురుగా వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుండి 40 కి.మీ.ల వేగంతో గాలులు వీచాయి. దీంతో నీలగిరి జిల్లాల్లో సోమవారం సాయంత్రం తేలికపాటి జల్లులు కురిశాయి. ఈ నేపథ్యంలో చెన్నై, తిరువళ్లూరు సహా 6 జిల్లాల్లో ఈ నెల 16 నుండి 17 వరకు కుండపోతగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. సముద్రతీర ప్రాంతాల నుండి రాష్ట్రం వైపు వీచే పడమటి గాలుల వేగంలో మార్పుల కారణంగా మంగళవారం నుండి పలు చోట్ల చెదురుమదురుగా ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని తెలిపారు. కోవై, నీలగిరి జిల్లాల్లో మంగళవారం భారీగా వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఈ నెల 16, 17 తేదీలలో చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, రాణిపేట, నీలగిరి, కోయంబత్తూరు జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తాయని వివరించారు. తేని, దిండుగల్ జిల్లాలోనూ ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ నెల 18న రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాల్లోను, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోను ఉరుములు, మెరుపులతో ఓమోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఆ సందర్భంగా గంటకు 40 నుండి 50 కి.మీ.ల. వేగంతో పెనుగాలులు వీస్తాయన్నారు. నీలగిరి,కోయంబత్తూరు జిల్లాల్లో పర్వతశ్రేణుల్లో కుండపోత వర్షాలు కురుస్తాయని, తేని, తెన్‌కాశి, తిరువళ్లూరు, కాంచీపురం, తిరువణ్ణామలై, విల్లుపురం, కళ్ళకురిచ్చి, కడలూరు జిల్లాల్లోను, పుదుచ్చేరి రాష్ట్రంలోనూ భారీగా వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. 19 నుండి 20 వరకు రాష్ట్రంలోని కొన్నిచోట్ల, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయి.

జాలర్లకు హెచ్చరిక...

ఇదిలా ఉండగా ఈ నెల 18న దక్షిణాది జిల్లాల్లోని సముద్రతీర ప్రాంతాల్లో, ప్రత్యేకించి మన్నార్‌జలసంధి ప్రాంతంలో గంటలకు 45 నుండి 55 కి.మీ.ల వేగంతో పెనుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సముద్రపు అలలు ఉదృతంగా ఎగసి పడే అవకాశాలున్నాయని, ఈ కారణంగా జాలర్లు ఆ రోజు చేపలవేటకు వెళ్ళకూడదని అధికారులు హెచ్చరిక జారీ చేశారు.



కడలూరు, మైలాడుదురై జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తాంబరం రైల్వేస్టేషన్ నుండి సోమవారం సాయంత్రం రైలులో చిదంబరానికి బయలుదేరిన సీఎం స్టాలిన్‌కు వీడ్కోలు పలుకుతున్న మంత్రులు



సరోజాదేవి స్మృతిలో కోలీవుడ్

● చిరస్థాయిగా నిలిచిపోయారు - సీఎం స్టాలిన్
● నడిగర్ సంఘం నివాళి
● సినీ ప్రముఖుల సంతాపం

అడయార్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అలనాటి ప్రముఖ నటి బి.సరోజా దేవి మరణంతో కోలీవుడ్ విషాద సాగరంలో మునిగిపోయింది. వెండితెరపై ఆమె వెలుగుల్ని, నటనా కౌశలాన్ని స్మరించుకుంటోంది. ఆమె నటించిన తొలి కన్నడ చిత్రం ఘన విజయం సాధించడంతో వరుస అవకాశాలు వచ్చాయి. దీంతో ఆమె తమిళ సినీ రంగ ప్రవేశం ఆలస్యమైంది. 'ఇల్లరమే నల్లరం' అనే చిత్రంలో చిన్న వేషం వేసిన ఆమెకు ఎంజీఆర్ నటించిన 'నాడోడి మన్నన్' చిత్రంలో యువరాణి రత్న పాత్రతో ప్రేక్షకుల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారు. ఆ తర్వాత ఆమె తమిళ చిత్రపరిశ్రమలో వెనక్కి తిరిగి చూడలేదు. వరుస అవకాశాలతో తమిళం, కన్నడ, తమిళం చిత్రాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా రాణించారు. అంతటి ప్రఖ్యాత నటి సరోజా దేవి మృతిపట్ల ముఖ్యమంత్రి స్టాలిన్, నడిగర్ సంఘం నిర్వాహకులు, పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలుపుతూ వేర్వేరుగా తమ సందేశాలను విడుదల చేశారు.

తమిళ ప్రేక్షకుల గుండెల్లో స్థానం సంపాదించారు: సీఎం

దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో దిగ్గజ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన సరోజా దేవి మరణవార్త ఎంతగానో కలిచివేసింది. నడిగర్ తిలగం శివాజీ గణేశన్, మక్కల్ తిలగం ఎంజీఆర్, ఎన్టీఆర్, జెమిని గణేశన్ వంటి అగ్ర నటులతో కలిసి నటించి ప్రేక్షకులను అలరించడంతో పాటు అనేక విజయవంతమైన చిత్రాలను అందించిన నటి. 'నాన్ పేస నినైప్పదెల్లాం నీ పేస వేండుమ్', 'కల్లెల్లాం మాణిక్య కల్లాగుమ్'వంటి ఎన్నో తియ్యటి పాటలకు తన నటన, అందం, అభినయం, హావభావాలతో వన్నె తెచ్చి 'అభినయ సరస్వతి'గా గుర్తింపు పొందారు. సుమారుగా 200కు పైగా చిత్రాల్లో నటించి, భారతీయ చిత్రపరిశ్రమకు ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ', 'పద్మభూషణ్' వంటి పౌర పురస్కారాలతో సత్కరించింది. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం 'కలైమామణి' అవార్డు అందించింది. ఎప్పుడు శాంతస్వభావంతో కనిపించే సరోజా దేవి మృతి భర్తీ చేయలేనిది. ఆమెను కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్న కుటుంబ సభ్యులకు, చిత్రపరిశ్రమకు చెందిన స్నేహితులకు, ఆమె అభిమానులకు నా ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిజేస్తున్నాను' అని సీఎం స్టాలిన్ విడుదల చేసిన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

అలాగే తమిళ చిత్రపరిశ్రమకు చెందిన సినీ నటి ఖుష్బూ, త్రిష, సీనియర్ నటులు టి.రాజేందర్, సత్యరాజ్, ఎస్వీ శేఖర్, ఆర్.పార్తిబన్, వైజీ మహేంద్రన్ తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు.

కోట్లాది మంది హృదయాలను చూరగొన్న నటి: రజనీ

కోట్లాది మంది అభిమానుల హృదయాలను చూరగొన్న అభిమాన నటి సరోజా దేవి ఇపుడు మన మధ్య లేరు. ఆమె ఆత్మకు శాంతి చేకూరుగాక అంటూ సూపర్‌స్టార్ రజనీకాంత్ ట్వీట్ చేశారు.



సరోజా దేవితో త్రిష



ఆ గొంతు మూగబోయింది
- కమల్ హాసన్

నన్ను చూసినప్పుడల్లా తమిళంలో 'చెల్ల మగనే' ('ప్రియ పుత్రుడా') అంటూ ఆప్యాయంగా పిలిచి, నా బుగ్గ గిల్లే గొంతు మూగబోయిందంటూ అగ్ర నటుడు కమల్ హాసన్ అన్నారు. ప్రముఖ నటి సరోజా దేవి మృతిపట్ల ఆయన ట్విటర్ ఖాతాలో తన సంతాప సందేశాన్ని వెల్లడించారు. 'ప్రియ పుత్రుడా' అని పిలిచే సరోజా దేవి తనకు మాతృసమానురాలని, భాష, ప్రాంతీయ సరిహద్దులు లేకుండా జీవించిన అత్యుత్తమ కళాకారిణి. ఆమె మరణవార్త జీర్ణించుకోలేనిది. తన రెండో చిత్రం 'పార్థాల్ పసి తీరుమ్' సినిమా షూటింగ్ జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయి. కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి. ఎల్లప్పుడూ నన్ను అగ్రస్థానంలో చూడాలని పరితపించేవారు. ఆమెకు ఇదే నా అంతిమ వీడ్కోలు' అని పేర్కొన్నారు.



బి.సరోజ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశాల్, కార్తి తదితరులు

నడిగర్ సంఘం నివాళి

సరోజాదేవి మృతిపట్ల నడిగర్ సంఘం తన సంతాపాన్ని ప్రకటించారు. ఆ సంఘం తాత్కాలిక కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తి, కార్యవర్గ సభ్యుడు హేమచంద్రన్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు అనంత నారాయణన్, నడిగర్ సంఘం మేనేజర్ దర్మరాజ్ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

పుదువై మంత్రిగా
జాన్‌కుమార్ ప్రమాణ స్వీకారం



మంత్రి జాన్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రంగస్వామి - నియామక ఎమ్మెల్యేలతో స్పీకర్ సెల్వం తదితరులు

పుదుచ్చేరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి ఎన్నార్ కాంగ్రెస్-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వ మంత్రివర్గంలో జరిగిన మార్పుల కారణంగా కొత్త మంత్రిగా బీజేపీ సీనియర్ నేత జాన్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు బీజేపీ అధిష్టానం కొత్తగా ఎమ్మెల్యేలుగా నియమించిన తీపాయందాన్, సెల్వం, రాజశేఖర్ కూడా ప్రమాణస్వీకారం చేశారు. పుదుచ్చేరిలో ఎన్నార్ కాంగ్రెస్ వ్యవస్థాపకులు ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి నేతృత్వంలో ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో కొనసాగుతోంది. ఈ మంత్రివర్గంలో చోటు కల్పించిన బీజేపీకి చెందిన సాయిశరవణకుమార్ గత నెల 27న తన పదవికి రాజీనామా చేశారు. అదేవిధంగా బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలు వీపీ రామలింగం, వెంకటేశన్, అశోక్ బాబు కూడా తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ క్రమంలో బీజేపీ అధిష్టానం రాజీనామా చేసిన ఈ నాలుగు పదవులను భర్తీచేసేందుకు నిర్ణయించింది. కామరాజర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే జాన్‌కుమార్‌ను మంత్రి పదవికి ఎంపికచేసింది. అలాగే నియామక ఎమ్మెల్యేలుగా మాజీ ఎమ్మెల్యే తీపాయందాన్, కారైక్కాల్‌కు చెందిన జీఎన్ఎస్ రాజశేఖరన్, సెల్వం నియమితులయ్యారు. పుదుచ్చేరి అసెంబ్లీలో స్పీకర్ సెల్వం ముగ్గురు ఎమ్మెల్యేలచేత సోమవారం ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం రాజ్ నివాస్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్త మంత్రిగా జాన్‌కుమార్‌చే గవర్నర్ కైలాస నాథన్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రంగస్వామి, మంత్రులు నమఃశివాయం, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు సీజేగా
జస్టిస్ మణీంద్రన్ మోహన్ శ్రీవాస్తవ

● రాజస్థాన్ హైకోర్టుకు జస్టిస్ శ్రీరాం బదిలీ



జస్టిస్ మణీంద్రన్ మోహన్ శ్రీవాస్తవ



జస్టిస్ శ్రీరాం కల్పతి రాజేంద్రన్

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీరాం కల్పతి రాజేంద్రన్ రాజస్థాన్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర న్యాయశాఖ సంయుక్త కార్యదర్శి జగన్నాథ్ శ్రీనివాసన్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. దేశంలో మొత్తం నాలుగు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను బదిలీ చేసినట్లు ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. 2013లో బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ శ్రీరాం.. 2016 మార్చి 2న పూర్తిస్థాయి న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అనంతరం 2024 సెప్టెంబరు 21వ తేదీ మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆయన ఈ ఏడాది సెప్టెంబరు 28వ తేదీన పదవీ విరమణ చేయాల్సివుంది. కానీ ఇంతలోనే రాజస్థాన్ హైకోర్టుకు బదిలీ అయింది. అదేవిధంగా హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు.

సొంత బలంతోనే అధికారంలోకి వస్తాం

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ ధీమా

ప్యారీస్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తదితర పార్టీల కలయికతో ఏర్పడిన పొత్తు పటిష్టమని, సొంత బలంతోనే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) మరో మారు ధీమా వ్యక్తంచేశారు. సేలం అసెంబ్లీ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఉదయం ప్రారంభించిన ఈపీఎస్ అక్కడినుంచి ఎన్నికల ప్రచారానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ, అన్నాడీఎంకే కూటమి ఏకాభిప్రాయంతో దృఢంగా, విజయం సాధిస్తామన్న నమ్మకంతో ఉందని, అందువల్ల 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధించి తీరుతుందని అన్నాడీఎం సొంత బలంతోనే అధికార పీఠమెక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 7వ తేదీ 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' పేరిట చేపట్టిన ఎన్నికల ప్రచార పయనంలో తాను ఇప్పటివరకు పర్యటించిన నియోజకవర్గంలో ప్రజలు తనను ఆహ్వానించిన తీరు, మద్దతు కొత్త ఉత్సాహం, ఉత్తేజాన్ని కలిగించిందని, అధికార డీఎంకేను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధమైనట్లు స్పష్టమైందన్నారు. మంగళవారం ప్రారంభించనున్న 'ఉంగల్ ఉడన్ స్టాలిన్' పథకం హాస్యాస్పదంగా ఉందని, ప్రజలను, ముఖ్యంగా మహిళలను మభ్యపెట్టేందుకు డీఎంకే కొత్త నాటకానికి తెరతీయనుందని ఈపీఎస్ విమర్శించారు. అదేవిధంగా నాలుగేళ్లకు పైగా అధికారంలో కొనసాగుతున్న డీఎంకే ప్రభుత్వ తరుపున పథకాలను సక్రమంగా ప్రజలకు చేర్చలేదని, అందువల్లే సమాచారశాఖలో నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించిందని ఎద్దేవా చేశారు. అన్నాడీఎంకే ప్రభుత్వం వచ్చాక అన్నిశాఖల్లో జరిగిన డీఎంకే అవినీతిపై విచారణ జరుపుతామని ఈపీఎస్ తెలిపారు.



సేలంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

మౌలిక సదుపాయాలేవీ?

● 45 రోజుల్లో ఏర్పాటు చేయకుంటే గుర్తింపు కష్టమే ● 141 ఇంజనీరింగ్ కాలేజీలకు అన్నావర్సిటీ నోటీసులు



చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అవి పేరుకే కళాశాలలు.. కానీ విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలే లేవు. అక్కడున్న పరికరాలు, ల్యాబ్‌ల సంగతి ఇక చెప్పాల్సిన పనే లేదు. దీంతో ఆయా విద్యాకేంద్రాల్లో చదివే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిని గమనించిన అన్నాయూనివర్శిటీ రాష్ట్రంలోని 141 ఇంజనీరింగ్ కాలేజీలకు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలో అన్నా విశ్వవిద్యాలయం పరిధిలో 460కి పైగా ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. ఆ కాలేజీలు ప్రతియేటా ఏఐసీటీఈ, అన్నా విశ్వవిద్యాలయంతో తమ గుర్తింపును రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ ప్రకారం ప్రస్తుత విద్యా సంవత్సరానికి (2025-26) గాను అన్నావిశ్వవిద్యాలయానికి గుర్తింపు కోసం దరఖాస్తులు పెట్టుకున్న ఇంజనీరింగ్ కాలేజీల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ధ్రువీకరణ పత్రాలను ఆ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. 141 ఇంజనీరింగ్ కాలేజీల్లో విద్యాబోధనకు అనువైన భవనసముదాయాలు, తగిన సదుపాయాలు లేవని గుర్తించి ఆ కాలేజీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఈ విషయమై అన్నావిశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. 141 ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత, గ్రంథాలయం లేకపోవటం, ప్రయోగశాలల కొరత వంటి ప్రధాన సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, కనీస మౌలిక సదుపాయాలు లేని కాలేజీలకు గుర్తింపు ఇవ్వడం సాధ్యపడదన్నారు. అదే సమయంలో షోకాజ్ నోటీసులు అందుకున్న ఈ కాలేజీల్లో 45 రోజుల్లోగా ఈ లోపాలను సరిదిద్ది మౌలిక వసతులు, అవసరమైన భవనాలు, ప్రయోగశాలలు నిర్మించాల్సి ఉంటుందని, ఆ తర్వాత మరోసారి అన్నావిశ్వవిద్యాలయం అధికారులు తనిఖీ చేస్తారని చెప్పారు. విశ్వవిద్యాలయ నిబంధనల మేరకు అన్ని సదుపాయాలున్నట్లు అధికారులు ధ్రువీకరించిన మీదటే గుర్తింపు మంజూరు చేస్తారని వివరించారు. ఇదిలా ఉండగా ఇంజనీరింగ్ కోర్సుల అడ్మిషన్లకు సంబంధించి జనరల్ కేటగిరీ అభ్యర్థులకు సోమవారం నుండి కౌన్సెలింగ్ ప్రారంభమవుతున్న సందర్భంలో అన్నా విశ్వవిద్యాలయం తీసుకున్న ఈ చర్యలపట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు పొందిన తర్వాత ఆ కాలేజీల గుర్తింపు రద్దయితే తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని చెబుతున్నారు. ఈ పరిస్థితులలో షోకాజ్ నోటీసులు అందుకున్న కాలేజీల జాబితాను అన్నా విశ్వవిద్యాలయం తక్షణమే విడుదల చేయాలని విద్యావేత్తలు సైతం డిమాండ్ చేస్తున్నారు.

ఇంజనీరింగ్ కోర్సులకు
జనరల్ కౌన్సెలింగ్ ప్రారంభం



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

పెరంబూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): యూజీ ఇంజనీరింగ్ కోర్సుల జనరల్ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. తొలివిడత ఇంజనీరింగ్ జనరల్ కౌన్సెలింగ్‌లో 39,145 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. ప్రత్యేక విభాగాల కౌన్సెలింగ్ ఈ నెల 7న ప్రారంభమై 11వ తేదీతో ముగిసింది. ఈ విభాగంలో 10వేల సీట్లుండగా, 894 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. మూడు విడతలుగా జరగనున్న జనరల్ విభాగం కౌన్సెలింగ్ ఆగస్టు 23తో ముగియనుంది. రాష్ట్రంలోని 417 ఇంజనీరింగ్ కళాశాలల్లో 1,90,166 ప్రభుత్వ కోటా సీట్లుండగా 3.02 లక్షల మంది దరఖాస్తు సమర్పించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం 2.41 లక్షల మందిని అర్హులుగా ఎంపిక చేసి, గత నెల 27వ తేది ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ ర్యాంకుల జాబితా విడుదల చేశారు. ఈ జాబితాలో 144 మంది విద్యార్థులు 200లకు 200 కటాఫ్ మార్కులు సాధించగా, వారిలో 139 మంది రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో చదివిన విద్యార్థులు చోటుచేసుకున్నారు. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు సంబంధించిన వివరాలు www.tneaonline.org అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

మాస్ ఆధ్వర్యంలో 'ప్రతిభా పురస్కారాలు'

ప్యారీస్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ ఆది ఆంధ్ర అరుంధతీయ ఆదివాసీ సంక్షేమ సంఘం (మాస్) ఆధ్వర్యంలో 33వ వార్షిక ప్రతిభా పురస్కార వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పెరంబూరులోని డీఆర్‌బీసీసీసీ పాఠశాల ప్రాంగణంలో ప్రార్థన, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుకలకు మాస్ అధ్యక్షుడు, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కొల్లిరాజు సభాధ్యక్షుడిగా వ్యవహరించి మాస్ చరిత్రను వివరించారు. మాజీ ఐపీఎస్ అధికారి దివంగత కేజే గోపాలకృష్ణ ఎస్సీ ఎస్టీ కుటుంబాలు, విద్యార్థులు సమాజంలో ఉన్నతవంతులుగా ఎదగాలన్న ధృక్పథంలో 1992వ సంవత్సరం మాస్ సంస్థను ప్రారంభించి మూడేళ్ల అనంతరం మృతిచెందారని తెలిపారు. అప్పటినుంచి మాస్ అనగారిన వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సేవా కార్యక్రమాలను ప్రతిఏటా పలువురి దాతలు, మాస్ సభ్యుల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు రాజు తెలిపారు. ముఖ్యఅతిథిగా చెన్నై ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు, విశిష్ట అతిథులుగా డిస్ట్రిక్ట్ రెవెన్యూ అధికారి జీఆర్ దివ్యశ్రీ, టామ్స్ వ్యవస్థాపకులు డా.గొల్లపల్లి ఇశ్రాయేలు, మాస్ సలహాదారు ఎ.జైసన్, చెన్నై కస్టమ్స్ రిటైర్డ్ సూపరిండెంట్, ఆస్కా ట్రస్టీ లయన్ వి.విజయేంద్ర రావు, మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగుశాఖాధిపతి డా.విస్తాలి శంకరరావు తదితర ప్రముఖులు హాజరై టెన్త్, ప్లస్‌టూ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన 65 మంది విద్యార్థిని, విద్యార్థులకు తలా రూ.2,500 అందజేసి అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ఏపీ ప్రభుత్వం నుంచి ఇటీవల ఉగాది పురస్కారం అందుకున్న జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్యను జ్ఞాపికతో సత్కరించారు. అందే విధంగా డాక్టర్ అంబేద్కర్, మాస్ వ్యవస్థాపకులు గోపాలకృష్ణ చిత్రపటాలకు నివాళులర్పించారు. నిర్వాహకులు వి.దీనదయాలన్, ఎన్.రాజీవ్, ఎస్.తిరుపతయ్య, ఎం.వీరయ్య, ఏఎన్ రాజేష్‌తో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, పలు తెలుగు సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మాస్ ఉపాధ్యక్షులు నూనె శ్రీనివాసులు స్వాగతోపన్యాసం చేయగా, చివరలో జాయింట్ సెక్రటరీ పాల్ కొండయ్య వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.



గుడిమెట్ల చెన్నయ్యను సత్కరిస్తున్న దృశ్యం - విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

సమాచార దర్శిని

డీఎంకే తంజావూరు ఉత్తర జిల్లా కార్యదర్శిగా అన్బళగన్

పెరంబూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): డీఎంకే తంజావూరు ఉత్తర జిల్లా కార్యదర్శిగా సాక్కోట్టై కె.అన్బళగన్ నియమితులయ్యారు. ప్రస్తుతం తంజావూరు ఉత్తర జిల్లా కార్యదర్శిగా ఉన్న ఎంపీ కల్యాణసుందరానికి బదులుగా అన్బళగన్‌ను నియమిస్తూ పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ సోమవారం సర్క్యులర్ జారీ చేశారు.

ఆగస్టు మొదటి వారం వరకు అడ్మిషన్లు

పెరంబూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఆగస్టు మొదటి వారం వరకు విద్యార్థుల అడ్మిషన్లు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులకు మౌఖిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు మార్చి 1వ తేది నుంచి ప్రారంభమైంది. కాగా, ప్రస్తుత విద్యా సంవత్సరం ఈ నెల మూడవ వారంలో మిడ్-టర్మ్ పరీక్షలు, సెప్టెంబరులో త్రైమాసిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో, పాఠశాలల్లో అడ్మిషన్లు ఆగస్టు మొదటి వారం వరకు కొనసాగించాలని ప్రధానోపాధ్యాయులకు సూచనలు జారీ అయ్యాయి.

19న 'విశ్వవిఖ్యాతుడి మధుర స్మృతులు'

టీనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ తెలుగు సమాఖ్య' ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన 'విశ్వవిఖ్యాతుడి మధుర స్మృతులు' పేరుతో నందమూరి తారక రామారావు 102వ జయంత్యుత్సవం జరుగనుంది. టినగర్ జీఎన్ చెట్టి రోడ్డు, అంకుర్ ప్లాజాలో వున్న సమాఖ్య ప్రాంగణంలో సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ అధ్యక్షతన జరుగనున్న ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ ముఖ్య అతిథిగా, మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు ప్రత్యేక అతిథిగా, జనని సాంఘిక సాంస్కృతిక సమితి వ్యవస్థాపకులు గుడిమెట్ల చెన్నయ్య గౌరవ అతిథిగా హాజరు కానున్నారు. ఈ వేడుకల్లో కేసరి హయ్యర్ సెకండరీ పాఠశాల విద్యార్థుల ప్రత్యేక కార్యక్రమం వుంటుంది. ఈ వేడుకకు అందరూ ఆహ్వానితులేనని సమాఖ్య అధ్యక్షురాలు కె.లక్ష్మీమోహనరావు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 40 మంది డీఎస్పీల బదిలీ

పెరంబూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 40 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీచేశారు. గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ పరిధిలోని ఎంకేబీ నగర్ అసిస్టెంట్ కమిషనర్ మణివన్నన్ మన్నార్‌గుడి ఏడీఎస్పీగాను, కేంద్ర క్రైం విభాగం అసిస్టెంట్ కమిషనర్ కావ్య మనప్పారై ఏడీఎస్పీగా బదిలీ అయ్యారు. అలాగే, కోవై సీబీసీఐడీ డీఎస్పీ శరవణన్, సేలం అసిస్టెంట్ కమిషనర్ సెల్వం, ఉగ్రవాద నిరోధక విభాగం డీఎస్పీ వందారస్వామి, చెన్నై తిరుమంగళం డిప్యూటీ కమిషనర్ బ్రహ్మానందన్ సహా పలువురు బదిలీ అయ్యారు.

8 ప్రాంతాల్లో చిన్న ఓడరేవులు

పెరంబూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో కొత్తగా చిన్న ఓడరేవులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. చెంగల్పట్టు జిల్లా ముగయూర్, పనయూర్, విల్లుపురం జిల్లా మరక్కాణం, కడలూరు జిల్లా సిలంపిమంగళం ప్రాంతాల్లో ఓడరేవులు ఏర్పాటుచేయనున్నారు. అలాగే, మైలాడుదురై జిల్లా వనగిరి, నాగపట్టణం జిల్లా విళుందమావడి, తూత్తుకుడి జిల్లా మనపాడు, కుమారి తీర ప్రాంతాలను గుర్తించారు. ఓడరేవుల అభివృద్ధికి ప్రైవేటు పెట్టుబడిదారులను ఆహ్వానించనున్నారు. ఆసక్తిగల పెట్టుబడిదారులకు పారిశ్రామిక విధానంలో 30 నుంచి 99 ఏళ్ల వరకు దీర్ఘకాలిక లీజు ప్రాతిపదికన కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

హవాలా సొమ్ము లావాదేవీల్లో గోల్‌మాల్

● దుకాణం సిబ్బంది కిడ్నాప్
● జీఎస్టీ అధికారి సహా ముగ్గురి అరెస్టు

అడయార్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో హవాలా సొమ్ము లావాదేవీల్లో గోల్‌మాల్ జరగడంతో ఒక దుకాణం ఉద్యోగి కిడ్నాప్‌కు గురయ్యాడు. ఈ వ్యవహారంలో జీఎస్టీ అధికారి సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, రాజస్థాన్‌కు చెందిన సుమిత్ సింగ్ అనే వ్యక్తి రిచ్చి స్ట్రీట్‌లో సెల్‌ఫోన్ సర్వీస్ సెంటర్ నడుపుతున్నారు. అలాగే, హవాలా సొమ్ము లావాదేవీ చేస్తున్నాడు. ఈ క్రమంలో సుమిత్ సింగ్‌ను ఆదివారం కిడ్నాప్ చేసినట్టు నగర పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఆయన తండ్రి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. ఆ వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. కిడ్నాప్ చేసిన సుమిత్ సింగ్‌ను అన్నా నగర్‌లోని జీఎస్టీ అధికారుల కాలనీలో బంధించినట్టు గుర్తించి, విడిపించారు. అలాగే, కిడ్నాప్‌కు కారణమైన ముగ్గురు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరిలో సురేందర్ అనే వ్యక్తి జీఎస్టీ అధికారిగా గుర్తించారు. హవాలా సొమ్ము లావాదేవీల్లో వారి మధ్య విభేదాలు రావడంతో సుమిత్ కిడ్నాప్ చేసినట్టు వెల్లడించారు. దీంతో ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఆన్‌లైన్ జూదంలో రూ.15 లక్షల నష్టం

● యువకుడి ఆత్మహత్య

పెరంబూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ జూదంలో నగలు పోగొట్టుకున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మదురై జిల్లాలో చోటుచేసుకుంది. సిల్లాంపట్టి ప్రాంతానికి చెందిన చిన్నరాజా (35) డ్రైవింగ్ శిక్షణ సంస్థలో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్నారు. చిన్నరాజాకు రూపవతి అనే భార్య, ఏడేళ్ల కుమారుడు, ఐదేళ్ల కుమార్తె ఉన్నారు. చిన్నరాజా కొద్దినెలలుగా ఆన్‌లైన్ జూదం ఆడుతూ సుమారు రూ.15 లక్షల వరకు పోగొట్టుకున్నట్లు సమాచారం. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తుండడంతో, రెండు రోజుల క్రితం అతడు ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతడి కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో, ఉసిలంపట్టి సమీపంలో రైలు పట్టాలపై ఓ యువకుడి మృతదేహం ఉండడంతో అక్కడకు వెళ్లి పరిశీలించిన పోలీసులు, ఆ మృతదేహం చిన్నరాజాగా గుర్తించారు.అప్పుల బాధతో అతను ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పుళల్ జైల్లో గార్డ్‌పై నైజీరియా మహిళ దాడి

పెరంబూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ సెంట్రల్ జైలులో గార్డ్‌పై నైజీరియా మహిళ దాడిచేయడం కలకలం రేపింది. నైజీరియా దేశానికి చెందిన మోనిక ఓ కేసులో పుళల్ జైలులో ఉంది. వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం లేదంటూ జైలుగార్డు సరస్వతితో వాగ్వివాదానికి దిగిన మోనిక కోపంతో సరస్వతిపై దాడి చేసినట్లు సమాచారం. గాయపడిన సరస్వతిని తోటి గార్డులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 60 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి తమిళనాడు వైద్య ఉద్యోగుల ఎంపిక బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యర్థులు ఈ ఏడాది జూలై 1వ తేది నాటికి 18 ఏళ్ల నిండి 32 ఏళ్లలోపుండి, ల్యాబ్ టెక్నీషియన్ డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. ఈ పోస్టులకు నెల వేతనంగా రూ.35,400 - రూ.1,30,400 వరకు అందించనున్నారు. మెరిట్ లిస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. 10వ తరగతి మార్కుల ఆధారంగా 20 శాతం, ప్లస్ మార్కుల ఆధారంగా 30 శాతం, డిప్లొమా మార్కుల ఆధారంగా 50 శాతం మెరిట్ లిస్ట్‌లో పరిగణలోకి తీసుకుంటారు. ఈ పోస్టుల భర్తీ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉండవు. ప్రత్యక్ష నియామక పద్ధతిలో భర్తీ చేయనున్నారు.https://www.mrb.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు రుసుముగా జనరల్ విభాగం అభ్యర్థులు రూ.600, ఎస్సీ ఎస్టీ విభాగాలకు చెందిన వారు రూ.300 చెల్లించాల్సి ఉంటుందని వైద్య ఉద్యోగుల ఎంపిక బోర్డు తెలిపింది.

తాగునీటి తొట్టెలో మానవ వ్యర్థాలు

● పోలీసుల విచారణ

ప్యారీస్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్ సమీపంలోని కార్యంకుడి గ్రామంలోవున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తాగునీటి తొట్టెలో మానవ వ్యర్థాలు కలిపిన గుర్తుతెలియని వ్యక్తులు వంట గదిలోవున్న వస్తువులను ధ్వంసం చేశారు.. ఈ పాఠశాలలో సుమారు 60 గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ఉదయం అల్పాహారం తయారుచేసేందుకు సోమవారం ఉదయం వెళ్లిన సిబ్బంది వంట గదిలోవున్న వస్తువులు ధ్వంసమై ఉండటం, పాఠశాల ప్రాంగణంలో చెట్లను నరకడం, నీటితొట్టెలో మానవ వ్యర్థాలు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా చెట్లకు ఉన్న కొబ్బరి బోండాలను కూడా తెంచుకుని వెళ్లడంపై వెంటనే ప్రధానోపాధ్యాయుడు గ్రామస్తులకు తెలియజేశారు. ఇందువల్ల పాఠశాల ముందు పెద్దసంఖ్యలో గుమిగూడిన ప్రజలు ఈ చర్యలకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేసి పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రాథమికంగా విచారణ జరిపి ముగ్గురు అనుమానితులను అరెస్టు చేసినట్లు తెలిసింది.

45 రోజుల్లో పరిష్కారం

అడయార్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): 'ఉంగలుడన్ స్టాలిన్' క్యాంపుల్లో స్వీకరించే వినతులపై 45 రోజుల్లో పరిష్కారించాలని సీఎం స్టాలిన్ ఆదేశించారని రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి అముద వెల్లడించారు. ఈ విషయాన్ని అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేసినట్టు పేర్కొన్నారు. నేడు కడలూరు జిల్లాలో పర్యటించనున్న సీఎం 'ఉంగలుడన్ స్టాలిన్' స్కీమ్‌పై రెవెన్యూ తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించనున్నారు. సోమవారం నగరంలో మీడియాతో మాట్లాడిన అముద... ఈ క్యాంపుల్లో స్వీకరించే వినతి పత్రాలపై 45 రోజుల్లో పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించినట్టు తెలిపారు.

ఘనంగా కాంగ్రెస్ నేత చిరంజీవి జన్మదిన వేడుకలు

● సంక్షేమ సహాయాల పంపిణీ

ప్యారీస్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి జన్మదిన వేడుకలు సోమవారం కీల్పాక్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది పేదమహిళలకు చీరలు పంపిణీ చేయడంతో పాటు ఐదుగురు విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, మాజీ ఎంపీ విశ్వనాథన్, టీఎన్‌సీసీలోని ఓబీసీ, విద్యార్థి, యువజన, వైద్య, న్యాయ విభాగాల నిర్వాహకులు, సౌత్ ఇండియా రాహుల్‌గాంధీ సంక్షేమ సంఘం నిర్వాహకులు, ఇళభాస్కర్, తనికాచలం, సురేష్‌బాబు, నవీన్, గోల్డెన్ రఫీక్, విద్యార్థుల సమక్షంలో చిరంజీవి కేక్ కట్ చేసారు. కార్యక్రమంలో గజమాలతో చిరంజీవి సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.


టీఎన్‌సీసీ ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవిని సత్కరిస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి విశ్వనాథన్ తదితరులు

రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న కేసుల వివరాలు అందించాలి

● మద్రాసు హైకోర్టులో టీవీకే పిటిషన్

పెరంబూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న అవినీతి కేసుల వివరాలు వెల్లడించాలా రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ తమిళగ వెట్రి కళగం (టీవీకే) తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. మద్రాసు హైకోర్టులో టీవీకే చెన్నై మండల న్యాయవాదుల విభాగం సంయుక్త కార్యదర్శి ఆదిత్యచోళన్ దాఖలుచేసిన పిటిషన్‌లో.. రాష్ట్రానికి చెందిన ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న అవినీతి కేసుల వివరాలు అందించాలని రాష్ట్ర అవినీతి నిరోధక శాఖకు గత ఏడాది నవంబరులో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అలాగే, వారి నమోదైచేసిన ఎఫ్ఐఆర్ వివరాలు కోరానని, అందుకు నా దరఖాస్తు తిరస్కరించారన్నారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా రాష్ట్ర సమాచార కమిషన్‌కు అప్పీలు చేసినా, ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదని వివరించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సమాచార హక్కు చట్టం కింద కోరిన సమాచారం ఇచ్చేందుకు నిరాకరించడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అని, నా అభ్యర్థనకు సంబంధించిన వివరాలు అందించాలని రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆదేశించాలని ఆయన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానున్నట్లు సమాచారం.

కాట్టుపాక్కంలో వివాహిత ఆత్మహత్య

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కాట్టుపాక్కంలో నివసిస్తున్న వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పూందమల్లి సమీపం కాట్టుపాక్కంకు చెందిన దేవారాజ్, కర్పగం దంపతుల కుమార్తె కుముదా (27) రెండేళ్ల క్రితం ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ తన సహోద్యోగి, బెంగళూరుకు చెందిన అజిత్‌కుమార్ (30)ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి రెండేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. ఈ నేపథ్యంలో కొద్ది రోజులకు ముందు అజిత్‌కుమార్ బెంగళూరు వెళ్లాడు. ఇంటిలో ఒంటరిగా ఉన్న కుముదా ఉన్నట్టుండి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల నివసిస్తున్నవారు కుముద కుమారుడి ఏడుపు విని ఆ ఇంటిలోపలకు వెళ్లి చూడా ఆమె ఉరివేసుకుని వేలాడుతుండటం చూసి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూందమల్లి పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. కుముదా మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ఆర్డీవో విచారణ చేపట్టారు.


కుముదా (ఫైల్‌ఫొటో)

పెండింగులోవున్న అరెస్టు వారెంట్ కేసులెన్ని?

● డీజీపీని ప్రశ్నించిన హైకోర్టు

ప్యారీస్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పెండింగులోవున్న అరెస్టు వారెంట్ కేసులపై నివేదిక దాఖలు చేయాల్సిందిగా డీజీపీకి మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలో అల్లికుళం న్యాయస్థానంలో విచారణ స్థాయి కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజరాజ చోళన్‌కు వ్యతిరేకంగా జారీ చేసిన అరెస్ట్ వారెంటును అమలుపరచాలని నీలాంగరై పోలీసులకు ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ జమునా శివలింగం హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు సోమవారం హైకోర్టు న్యాయమూర్తి వేల్‌మురుగన్ ముందుకు విచారణ రాగా, పిటిషనర్ తరుపు న్యాయవాది హాజరై ఈ కేసులో జనవరిలో న్యాయస్థానం జారీ చేసిన ఉత్తర్వులను పోలీసులు ఇప్పటివరకు అమలుపరచలేదని, ఇదే విధంగా రాష్ట్రంలో అరెస్టు వారెంటు కేసులు చాలా వరకు పెండింగులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయస్థానాలు జారీచేసే అరెస్ట్ వారెంటును నిర్ణీత కాలంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను సంబంధిత న్యాయస్థానాల్లో హాజరుపరచాల్సిన బాధ్యత పోలీసులదేనని సూచించి, అలా లేని పక్షంలో వారెంటు ఎందుకు అమలుపరచలేదో పూర్తి వివరాలతో న్యాయస్థానాల్లో నివేదిక దాఖలు చేసి, కొత్త వారెంట్ జారీచేయాలని తెలిపారు. అరెస్టు వారెంట్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వాటిని పెండింగులో ఉంచాల్సిన అధికారం పోలీసులకు లేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని కేసుల్లో అరెస్టు వారెంటు జారీ చేసి, పెండింగులో ఉన్నాయన్నదానిపై ఈ నెల 25వ తేదీన నివేదిక దాఖలు చేయాల్సిందిగా రాష్ట్ర డీజీపీకి, చెన్నై పోలీస్ కమిషనర్‌కు హైకోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

లాకప్‌డెత్‌పై సీబీఐ విచారణ ప్రారంభం

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుభువనం సమీపంలోని మడప్పురం భద్రకాళియమ్మన్ ఆలయం వాచ్‌మన్ అజిత్‌కుమార్ (29) లాకప్‌డెత్‌పై సీబీఐ విచారణ సోమవారం ఉదయం ప్రారంభమైంది. తొలుత హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఆదేశాల మేరకు మదురై జిల్లా జడ్జి జాన్ సుందర్‌లాల్ సురేష్ వారం రోజులపాటు విచారణ జరిపారు. ఈ లాకప్‌డెత్‌పై ప్రధాన ప్రతిపక్షాల నుండి తీవ్ర వ్యతిరేకతలు రావటంతో రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హైకోర్టు హర్షం వ్యక్తం చేసింది. అదే సమయంలో విచారణాధికారిని వారంలోగా నియమించాలని సీబీఐకి ఉత్తర్వు జారీ చేసింది. ఆ మేరకు అజిత్‌కుమార్ లాకప్‌డెత్ విచారణాధికారిగా మోహిత్‌కుమార్ నియమితులయ్యారు. అతడి నేతృత్వంలోని సీబీఐ అధికారులు ఢిల్లీ నుంచి ఆదివారం రాత్రి మదురై చేరుకున్నారు. మోహిత్‌కుమార్ సహా ఐదుగురు అక్కడి రెస్టారెంట్‌లో రాత్రి బసచేశారు. సోమవారం ఉదయం మదురై నుండే సీబీఐ అధికారులు విచారణ ప్రారంభించారు. సౌత్‌జోన్ పోలీసు ఐజీ ప్రేమ్ ఆనంద్ సిన్హా, శివగంగ ఎస్పీ తదితరుల వద్ద విచారణ జరిపారు. ఆ తర్వాత హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ నుండి కేసుకు సంబంధించిన పత్రాలు స్వీకరించారు. మధ్యాహ్నం తిరుభువనం ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది వద్ద అజిత్‌కుమార్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత అతడి నివాసగృహం వద్దకు వెళ్ళికుటుంబీకుల వద్ద కూడా సీబీఐ అధికారులు విచారించారు.


అజిత్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూర్: ముత్తమిళ్ నగర్, మూగాంబిగై నగర్, హిందుస్తాన్ మోటార్ నగర్, అక్బర్ ఖాజా నగర్, హాజి నగర్, గాంధీ నగర్, వీపీసీ నగర్, ఈస్ట్ బాలాజీ నగర్, గంగై నగర్, రెడ్ హిల్స్ మెయిన్ రోడ్డు

తిల్లైగంగా నగర్: తిల్లైగంగా నగర్, నంగనల్లూర్ కొంత భాగం, పళవన్ తాంగళ్, జీవన్ నగర్, సంజయ్ గాంధీ నగర్, వేళచ్చేరి, ఆదంబాక్కం, ఆండాళ్ నగర్, వానువంపేట, బృందావన నగర్, మహాలక్ష్మి నగర్, శాంతి నగర్, పుళిదివాక్కం, ఉల్లాగరం కొంత భాగం, ఏజీఎస్ కాలనీ (వేళచ్చేరి వెస్ట్), ఈబీ కాలనీ, మోహనపురి, ఆదంబాక్కం న్యూ కాలనీ.

వేళచ్చేరి: వెంకటేశ్వర నగర్, ఎంజీఆర్ నగర్, బైపాస్ రోడ్డు, దేవికరుమారియమ్మన్ నగర్, శశి నగర్, పద్మావతి నగర్, మురుగు నగర్, విజయ నగర్, గంగై నగర్, భువనేశ్వరి నగర్, రామ నగర్, నెహ్రూ నగర్, దండీశ్వరం నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, వందడుగుల రోడ్డు, రాజ్యలక్ష్మి నగర్, జగన్నాథపురం, ద్రౌపది అమ్మన్ ఆలయం, టాన్సీ నగర్, గాంధీ వీధి, వీజీపీ సెల్వ నగర్, సీతారామన్ నగర్, భువనేశ్వరి నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, తరమణి, బేబి నగర్

సేలయూర్: క్యాంప్ రోడ్డు, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, భారతి పార్క్ వీధి, కరణం వీధి, కరణం వీధి ఎక్స్‌టెన్షన్, రాజా అయ్యర్ వీధి, మాతా ఆలయ వీధి, నెల్లూరమ్మన్ ఆలయ వీధి, వలైయాధన్ వీధి, న్యూ బాలాజీ నగర్, అవ్వై నగర్, ఎంఎస్‌కే నగర్, కన్నన్ నగర్, ఐఏడీ కాలని, ముత్తాలమ్మన్ ఆలయ వీధి, ఈశ్వరన్ ఆలయ వీధి, కుమరన్ పార్క్ వీధి, రంగనాథన్ వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి

తిరుముడివాక్కం: వెట్రివేల్ నగర్, భరద్వాజ నగర్, పీటీసీ క్వార్టర్స్ సరస్వతి నగర్, భాగ్యంగోపాలకృష్ణ నగర్, సెంథిల్ నగర్, నడువీరపట్టు పంచాయతి, ఎట్టియాపురం, ఆర్‌ఆర్‌టీ గార్డెన్, దర్శన్ గార్డెన్, అశోక్‌నాడవనం, గాయత్రి మెగా నగర్, పూతండలం పంచాయతి, పింక్ హౌస్

పళ్లికరణై: పెరుంబాక్కం కామకోటి నగర్, ఐఐటీ కాలనీ, మాంపాక్కం మెయిన్ రోడ్డు, బాబు నగర్, పామ్ గార్డెన్, గాయత్రి నగర్, రాయల్ గార్డెన్, కృష్ణవేణి నగర్

షోలింగనల్లూర్: ఎల్కాట్ అవెన్యూ రోడ్డు, మోడల్ స్కూల్ క్లాసిక్ పార్క్, నెడుంజెళియన్ వీధి, నారాయణస్వామి వీధి, పటవట్టమ్మన్ ఆలయ వీధి, పరమేశ్వరన్ నగర్, పొన్నియమ్మన్ ఆలయ వీధి, కుమరన్ నగర్, టీఎన్‌హెచ్‌బీ, అలమేలు మంగాపురం, గాంధీ నగర్, ఓఎంఆర్, సూకంపాళయం రోడ్డు, తిరువళ్లువర్ రోడ్డు, పాండిచ్చేరి పేట, సీమెన్‌జెరి, జవహర్ నగర్, సత్యభామ జేపీఆర్, సెయింట్ జోసప్ కాలేజ్, విలేజ్ హై రోడ్డు, వేలునాయకర్ వీధి, నెహ్రూ వీధి, గణేశ్ నగర్, మేడవాక్కం రోడ్డు, విప్రో రోడ్డు, అన్నా వీధి, దేవరాజ్ నగర్, కుమరన్ నగర్, ఎళిల్ నగర్, గాంధీ వీధి, ఎంజీఆర్ వీధి

కోయంబేడు మార్కెట్: జయలక్ష్మి నగర్, ధనలక్ష్మి నగర్, మూకాంబిగై నగర్, బాలకృష్ణ నగర్, రాజీవ్ గాంధీ నగర్, జానకిరామ్ కాలని, భువనేశ్వరి నగర్, రామలింగ నగర్, తామరై అవెన్యూ

రూ.1.75 కోట్లతో ఆస్పత్రి అదనపు గదులకు భూమిపూజ


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని కోనేటంపేట ప్రభుత్వాసుపత్రిలో రూ.1.75 కోట్లతో అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే చంద్రన్ ఆదివారం సాయంత్రం భూమిపూజ నిర్వహించారు. గత కొన్ని నెలలుగా ఆస్పత్రిలో వసతులను మెరుగుపరచాలని, అదనపు గదుల నిర్మాణాలు చేపట్టాలని పలుమార్లు ప్రభుత్వ ఉన్నతాధికారులకు ప్రజలు వినతిపత్రాలను సమర్పించగా, ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ చొరవతో ఎట్టకేలకు అదనపు గదుల నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. దీంతో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే చంద్రన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి గదుల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపనుల శాఖ అధికారి దేవన్, ఎస్టీడీవో మురళీ, మండల డీఎంకే కార్యదర్శులు శ్రీనివాసన్, సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏడో రోజు కొనసాగిన పార్ట్ టైం టీచర్ల ధర్నా


రాస్తారోకో చేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులు

పెరంబూర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ పార్ట్ టైం ఉపాధ్యాయులు చేపడుతున్న ధర్నా ఏడో రోజైన సోమవారం కొనసాగింది. ఉద్యోగాల క్రమబద్ధీకరణ, ఇతర రాయితీలు ఇవ్వాలని కోరుతూ పార్ట్ టైం ఉపాధ్యాయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. దీర్ఘకాలంగా నెలకొన్న తమ సమస్యలపై ప్రభుత్వ దృష్టి సారించలేదని ఆరోపిస్తూ రాష్ట్ర పార్ట్ టైం ఉపాధ్యాయుల సంఘం ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఆ ప్రకారం నుంగంబాక్కంలో డీపీఐ కార్యాలయం సమీపంలో ఆరు రోజులుగా ఉపాధ్యాయులు ఆందోళన చేపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం పలు జిల్లాల నుంచి సుమారు 300 మంది ఉపాధ్యాయులు డీపీఐ కార్యాలయానికి చేరుకున్నారు. రోడ్డు పక్కగా ఏర్పాటుచేసిన వేదికపై ఆందోళన చేపడుతున్న ఉపాధ్యాయులు, ఒక్కసారిగా రోడ్డు పైకి చేరుకుని బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో, పోలీసులు వారిని అక్కడి నుంచి తొలగించే ప్రయత్నాలు చేపట్టారు. కొందరు ఉపాధ్యాయులు పోలీసులతో వాగ్వివాదానికి దిగడంతో, పోలీసులు వారిని బలవంతంగా అక్కడి నుంచి పంపించారు. రాస్తారోకో సందర్భంగా శివగంగకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు స్పృహ తప్పి పడిపోవడంతో, అక్కడ సిద్ధంగా ఉంచిన అంబులెన్స్‌లో ఆమెను ఆసుపత్రికి తరలించారు.

కొయ్యసామగ్రి కర్మాగారంలో భారీ అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళం సభ్యులు

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం సమీపంలోని కొయ్యసామగ్రి కర్మాగారంలో సోమవారం వేకువజాము సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో లక్షలాదిరూపాయల విలువచేసే వస్తువులు కాలి బూడిదయ్యాయి. కాంచీపురం వెల్లగేట్ ప్రాంతంలోని ఆ కర్మాగారంలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 15 మంది పనిచేస్తున్నారు. ఆ కర్మాగారంలో కొయ్య సామగ్రి తయారైన తరువాత మిగిలిన కొయ్య ముక్కలను, పగిలిన పలకలను కుప్పలుగా ఉంచారు. ఈ నేపథ్యంలో సోమవారం వేకువజాము ఆ కర్మాగారంలో మంటలు చెలరేగి కొయ్యముక్కలన్నింటికీ నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో లక్షలాది రూపాయల విలువచేసే కొయ్య సామగ్రి కాలి బూడిదయింది. ఆ కర్మాగారానికి చేరువగా బసచేస్తున్న ఉత్తరాది కార్మికులు వంట చేస్తుండగా నిప్పురవ్వలు చెలరేగి కొయ్య ముక్కలకు నిప్పంటుకోవటం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక అధికారులు తెలిపారు. పొన్నేరికరై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నారు.

అన్నాడీఎంకే, బీజేపీ మధ్య పొత్తు పటిష్టం!

● కేంద్రమంత్రి ఎల్.మురుగన్

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నేతృత్వంలో అన్నాడీఎంకే, బీజేపీ మధ్య కుదిరిన పొత్తు చాలా పటిష్టంగా ఉందని ప్రసారమాధ్యమాల్లో వచ్చినట్లు రెండు పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేవని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ అన్నారు. కోయంబత్తూరుజిల్లా మేట్టుపాళయంలో తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా డీఎంకే పాలనలో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, వారికి ప్రాణాలకు భద్రతలేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజావ్యతిరేక డీఎంకే పాలన అసెంబ్లీ ఎన్నికలలో పతనం కావటం ఖాయమన్నారు రాష్ట్రంలో అధికారమంతా సీఎం స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి మాత్రమే చెలాయిస్తున్నారని, మంత్రులంతా వారికి గులాములుగా పనిచేస్తున్నారని మురుగన్ ఆరోపించారు.

అజిత్‌కుమార్ కుటుంబానికి రూ.7.5లక్షల సాయం


రూ.7.5లక్షల చెక్కు అందజేస్తున్న మంత్రి కేఆర్ పెరియకరుప్పన్

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లాకప్‌డెత్‌కు గురైన శివగంగ జిల్లా తిరుభువనం ప్రాంతంలోని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు అజిత్‌కుమార్ కుటుంబీకులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ సోమవారం సాయంత్రం అందజేశారు. ఓ చోరీ కేసు విచారణకు వెళ్ళిన అజిత్‌కుమార్ లాకప్ డెత్ అయిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఆ సంఘటన గురించి తెలియగానే అజిత్‌కుమార్ తల్లికి సీఎం స్టాలిన్ ఫోన్ చేసి 'సారీ' చెప్పుకున్నారు. అంతే కాకుండా కుటుంబానికి, ఇంటిపట్టా, అజిత్ తమ్ముడికి ఆవిన్ సంస్థలో ఉద్యోగం కల్పించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రి పెరియకరుప్పన్ ప్రభుత్వం ప్రకటించిన రూ.7.5 లక్షల చెక్కు అజిత్‌కుమార్ కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పెరియకరుప్పన్ మీడియాతో మాట్లాడుతూ అజిత్‌కుమార్ కుటుంబానికి కేటాయించిన ఇంటిస్థలం అనువుగా లేదని చెప్పడంతో వారికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించమని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారని, త్వరలోనే వారికి ఇంటి స్థలం కేటాయిస్తారని చెప్పారు.

స్టంట్ ఆర్టిస్ట్ మృతి

- పా.రంజిత్‌పై కేసు

అడయార్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం సమీపంలో చిత్రం షూటింగ్ సమయంలో జరిగిన ప్రమాదంలో స్టంట్ ఆర్టిస్ట్ రాజు మృతి చెందిన ఘటనపై ఆ చిత్ర దర్శకుడు పా.రంజిత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్య హీరోగా పా.రంజిత్ దర్శకత్వంలో 'వెట్టువం' అనే చిత్రం తెరకెక్కుతోంది. నాగపట్టణంలో షూటింగ్ జరుగుతుండగా, ఆదివారం ఉదయం ఓ హైరిస్క్ స్టంట్ చిత్రీకరిస్తుండగా జరిగిన ప్రమాదంలో స్టంట్ ఆర్టిస్ట్ రాజు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ఆ చిత్ర దర్శకుడు పా.రంజిత్‌పై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

చిత్రజ్యోతి

ఆగస్టు 1న 'అంబికాపతి' రీ-రిలీజ్



'అంబికాపతి'లో ధనుష్ - సోనమ్ కపూర్

ధనుష్ హీరోగా నటించిన 'అంబికాపతి' చిత్రం ఆగస్టు ఒకటో తేదీన రీ రిలీజ్ చేయనున్నారు. సూపర్ హిట్ చిత్రంగా నిలిచిన ఈ సినిమాను అప్ స్వింగ్ ఎంటర్‌టైన్మెంట్ అనే నిర్మాణ సంస్థ మళ్ళీ విడుదల చేసేందుకు రైట్స్ సొంతం చేసుకుంది. ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వం వహించారు. ధనుష్, సోనమ్ కపూర్ జంటగా నటించగా, 2013లో విడుదలైంది. దేశవ్యాప్తంగా విజయవంతంగా ప్రదర్శించబడిన ఈ చిత్రాన్ని ఇపుడు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వివిధ సన్నివేశాలను కొత్తగా జోడించి, ఏఐ సాంకేతికత, ఆధునిక అట్మాస్ సౌండ్ డిజైన్, క్లైమాక్స్ సన్నివేశాలను 4కే నాణ్యతతో డిజైన్ చేసి రిలీజ్ చేస్తున్నారు. హిందీలో 'రంజనా' అనే పేరుతో రూపొందించి విడుదల చేయగా, రూ.100 కోట్ల వరకు కలెక్షన్లు రాబట్టింది. తమిళంలో 'అంబికాపతి' పేరుతో డబ్బింగ్ చేసి విడుదల చేశారు.

అనుమతి పొందే పాటను ఉపయోగించాం : వనిత

అడయార్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తాను ప్రధాన పాత్రలో నటించిన 'మిసెస్ అండ్ మిస్టర్' చిత్రంలో 'రాత్తిరి శివరాత్తిరి' అనే పాటను ఆడియో సంస్థ ఎకో నుంచి అనుమతి పొందిన తర్వాతే ఉపయోగించామని నటి వనిత కోర్టుకు తెలిపారు. సోమవారం జరిగిన విచారణ సందర్భంగా న్యాయమూర్తి సెంథిల్ కుమార్ రామమూర్తి ధర్మాసనంలో ఆమె తరపు న్యాయవాది ఈ విషయం తెలిపారు. తాను స్వరపరిచిన పాటను తన అనుమతి లేకుండా చిత్రంలో ఉపయోగించారని, ఇది కాపీరైట్ ఉల్లంఘన కిందకే వస్తుందని, అందువల్ల చిత్రం నుంచి ఆ పాటను తొలగించాలంటూ సంగీత దర్శకుడు ఇళయరాజా మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం విచారణ జరిగిన సమయంలో ఇరు వర్గాల వాదనలు ఆలకించిన ధర్మాసనం... వనిత కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణ వారం రోజులకు వాయిదా వేసింది.

ముగ్గురు హీరోయిన్లతో మొట్టై రాజేంద్రన్ నృత్యం



హీరోయిన్లతో మొట్టై రాజేంద్రన్

కోలీవుడ్‌లోని హాస్య నటుడు మొట్టై రాజేంద్రన్ 68 యేళ్ళ వయసులో ముగ్గురు హీరోయిన్లతో కలిసి ఓ పాటకు డ్యాన్స్ చేయడం ఇపుడు టాక్‌ఆఫ్ ది కోలీవుడ్‌గా మారింది. ఈ పాట టీజర్ ఇపుడు వైరల్ అయింది. ఈ వయసులో ముగ్గురు హీరోయిన్లతో డ్యాన్సా అంటూ నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గణేష్ నగేష్ హీరోగా నటించిన 'ఉరుట్టు ఉరుట్టు' చిత్రంలో మొట్టై రాజేంద్రన్ ఓ కీలక పాత్ర పోషించడంతో పాటు ముగ్గురు హీరోయిన్లతో కలిసి నృత్యం చేశారు. దర్శకుడు భాస్కర్ సదాశివం ఐటమ్ సాంగ్‌ను ప్రత్యేకంగా చిత్రీకరించారు. ఇది 'ముదల్వన్' చిత్రంలోని 'ఉప్పు కరువాడు' అనే బాణీలో సాగుతుంది. ఇటీవల నగరంలో జరిగిన ఈ చిత్ర ఆడియో రిలీజ్ వేడుకలో ఈ పాటను ప్రత్యేకంగా ప్రదర్శించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అయితే, 68 యేళ్ళ వయసులో ముగ్గురు హీరోయిన్లతో డ్యాన్స్ చేసిన మొట్టై రాజేంద్రన్ మాత్రం సిగ్గుపడి ఆడియో ఫంక్షన్‌కు మాత్రం రాలేదని చిత్ర బృందం సభ్యులు చెబుతున్నారు. హీరోయిన్లు మాత్రం హాజరై తమ అనుభవాలను షేర్ చేసుకున్నారు. కాగా, ఈ ముగ్గురు హీరోయిన్లలో 'మస్కారా' పాటతో మంచి గుర్తింపు పొందిన అస్మిత ఉన్నారు.

తమిళంలో మళ్లీ అవకాశాలు రాలేదు

- శిల్పాశెట్టి



కోలీవుడ్‌లో తనకు సినిమా అవకాశాలు రాలేదని, అందుకే తమిళంలో నటించలేకపోయానని బాలీవుడ్ హీరోయిన్ శిల్పాశెట్టి అన్నారు. తాజాగా నగరంలో జరిగిన ఓ సినీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, 'చెన్నై అంటే నాకు ఎంతో ఇష్టం. సినిమాల షూటింగ్ కోసం పలుమార్లు ఇక్కడకు వచ్చిన సందర్భాలున్నాయి. ఇక్కడ నాకు నచ్చిన వంటకం మసాలా దోశ. తమిళంలో 'మిస్టర్ రోమియో' సినిమా చిత్రీకరణ సమయంలో నృత్యదర్శకుడు ప్రభుదేవా, హాస్య నటుడు వడివేలు నాకు తమిళం నేర్పించారు. ఇలాంటి మరిచిపోలేని అనుభవాలు అనేకం ఉన్నాయి. 'ఖుషి' సినిమాలో హీరో విజయ్‌తో కలిసి ఒక ప్రత్యేక గీతంలో నటించాను. ఆ తర్వాత తమిళంలో చెప్పుకోదగిన పెద్ద చిత్రాల్లో అవకాశాలు రాలేదు. ఈ కారణంగానే తమిళ చిత్రాల్లో నటించలేకపోయాను' అని వివరించారు.

18న ఒకే రోజు 11 సినిమాల విడుదల



'బన్ బట్టర్ జామ్'లో ఓ దృశ్యం

ఈ నెల 18వ తేదీ శుక్రవారం ఏకంగా 11 సినిమాలు విడుదలకానున్నాయి. వచ్చే నెలలో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన 'కూలీ' విడుదలకానున్న నేపథ్యంలో చిన్న నిర్మాతలు ముందుగానే తమ చిత్రాలను విడుదల చేసేందుకు పోటీ పడుతున్నారు. దీంతో థియేటర్ల కేటాయింపు పెద్ద సమస్యగా మారింది. ఈ కారణంగా, థియేటర్ యజమానులు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య గందరగోళం నెలకొంది. వచ్చే శుక్రవారం విడుదలకానున్న చిత్రాల్లో 'జన్మ నచ్చత్తిరం', 'బన్ బట్టర్ జామ్', 'టైటానిక్ కాలమ్ పుదిదు', 'గెవి', 'సెంట్రల్', 'అగ్నేయ', 'ఆక్కిమిప్పు', 'యాదుమ్ అరివాన్', 'నాళై నమదే', 'ట్రెండింగ్' చిత్రాలున్నాయి. ఈ సినిమాలకు 70 శాతం థియేటర్లను కేటాయించే అవకాశం ఉంది. ఎందుకంటే... ఇటీవల విడుదలైన '3బీహెచ్‌కే', 'మార్గన్' చిత్రాలను ప్రేక్షకులు ఆదరించడంతో విజయవంతంగా ప్రదర్శితమవుతున్నాయి. అందువల్ల ఈ చిత్రాలు ప్రదర్శించే థియేటర్లను మినహాయించి, మిగిలిన థియేటర్లను కొత్త చిత్రాలకు కేటాయించనున్నారు.

పులకించిన తిరుప్పరంకుండ్రం

● వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయ మహాకుంభాభిషేకం





విద్యుత్ కాంతుల్లో ఆలయ ప్రాంగణం - కుంభాభిషేకంలో భక్తజనం





సంప్రోక్షణకు పచ్చజెండా ఊపుతున్న మంత్రులు పీకే శేఖర్‌బాబు, మూర్తి - సంప్రదాయ వస్త్రధారణతో కళాకారులు

ప్యారీస్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోరికలు తీర్చే కొంగు సుబ్రహ్మణ్యస్వామి కొలువైన తిరుప్పరంకుండ్రం ఆలయ మహాకుంభాభిషేకం సోమవారం వేకువజామును కనుల పండువగా జరిగింది. ఈ వేడుకలకు దేశవిదేశాల నుంచి వేల సంఖ్యలోభక్తులు తరలివచ్చారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని ఈ ఆలయంలో 1988, 2000, 2011 సంవత్సరాల్లో కుంభాభిషేక జరిపారు. ఈ నేపథ్యంలో, ధర్మకర్తల మండలి చేపట్టిన ప్రయత్నంతో రూ.2.36 కోట్ల తో జీర్ణోద్ధరణ పనులు పూర్తిచేసి, 14యేళ్ళ అనంతరం సోమవారం తెల్లవారుజామున 5.35 గంటలకు శుభలగ్నంలో మహాకుంభాభిషేకాన్ని శివాచార్యులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాకారాలు, వళ్లి, దేవసేన కల్యాణ మండపం, షష్టి మండపాల్లో ఏర్పాటు చేసిన 75 యాగగుండాల వద్ద ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు 150 మంది శివాచార్యులతో కూడిన బృందం యాగపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏడుగురు మహిళల సహా 80 మంది ఓదువార్లు (కీర్తనలు గానం చేసేవారు) తమిళంలో వేదపారాయణం చేశారు.. సోమవారం తెల్లవారుజామున 3.45 నుంచి 4.45 గంటల వరకు 8వ యాగశాల పూజలు పూర్తిచేసి మేళతాళాలతో ఉత్సవమూర్తులు, పవిత్ర జలకలశాలను ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు మీనాక్షి అమ్మవారి సమేత సుందరేశ్వరుడు, పరివార మూర్తులు, 125 అడుగుల రాజగోపురం, గోవర్ధనాంబిక విమానం, వినాయక విమానం, పశుపతీశ్వరుల విమాన సన్నిధులపై కలశాలను పవిత్ర జలాలతో సంప్రోక్షించి కుంభాభిషేకం చేశారు. అంతేకాకుండా గర్భగుడిలోని దుర్గాదేవి, కర్పక వినాయకుడు, సత్యగిరీశ్వరుడు, పవళకనివాయి పెరుమాళ్ విగ్రహాలకు మహా అభిషేకం, దీపారాధన జరిపించారు. భక్తుల హరోంహర నామస్మరణతో తిరుప్పరంకుండ్రం మారుమోగింది. మహా కుంభాభిషేక సందర్భంగా ఆలయ గోపురం, మాడవీధులు, నగరంలోని పలు ప్రాంతాలను విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. హిందూ దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, రిజిస్ట్రేషన్‌శాఖ మంత్రి మూర్తి, ఎమ్మెల్యే రాజన్‌చెల్లప్ప, మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌కు చెందిన న్యాయమూర్తులు, హిందూ దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు. కుంభాభిషేకం రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు పలు జిల్లాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపాయి. అలాగే మదురై కార్పొరేషన్ 10 ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు, తాగునీటి సరఫరా, మొబైల్ టాయిలెట్లు తదితర వసతులు సమకూర్చింది.

ప్రభుత్వ సమాచారశాఖలో నలుగురు ఐఏఎస్ అధికారులు



సీనియర్ ఐఏఎస్ అధికారులు జె.రాధాకృష్ణన్, గగన్‌దీప్ సింగ్ బేదీ, ధీరజ్‌కుమార్, అముద

ప్యారీస్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ సమాచారశాఖకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు సచివాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం, పథకాలు తదితర విషయాలను సకాలంలో ప్రజల వద్దకు చేర్చేలా దగ్గరలోవున్న మీడియా ద్వారా తెలుసుకునేలా ప్రభుత్వం అన్నిశాఖలను సమన్వయ పరుస్తూ సీనియర్ ఐఏఎస్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పజెప్పింది. ఇందులో ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి తమిళనాడు విద్యుత్ బోర్డు చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్, ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థశాఖ కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేదీ, ప్రభుత్వ ఎక్సైజ్ విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్, ప్రభుత్వ రెవెన్యూ అదనపు ప్రధాన కార్యదర్శి అముద ఉన్నారు. ఈ ఉన్నతాధికారులు మీడియా ప్రతినిధులకు ప్రభుత్వశాఖలకు సంబంధించిన స్పష్టమైన సమాచారాన్ని సకాలంలో తెలియజేస్తారని సచివాలయం తన ప్రకటనలో తెలిపింది.

డీఎంకే సీనియర్ నేతకు కనిమొళి పరామర్శ

● ఫోన్‌లో స్టాలిన్ ఓదార్పు



శక్తివేల్‌ను పరామర్శిస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి

టినగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం తాలూకాకు చెందిన డీఎంకే సీనియర్ సభ్యుడు, పార్టీ స్థానిక డిప్యూటీ కార్యదర్శి ఎ.శక్తివేల్‌ను ఎంపీ కనిమొళి పరామర్శించారు. ఆరు దశాబ్దాలకుగా పైగా పార్టీకి సేవలందించి అన్ని పార్టీల నేతలకు అభిమానపాత్రుడిగా వ్యవహరించిన శక్తివేల్ వృద్ధాప్య సమస్యలకు తోడు స్వల్ప అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఆయనకు అన్ని విధాలా సాయం అందించాలని మంత్రి అనితా రాధాకృష్ణన్‌కు సూచించారు. ఈ నేపథ్యంలో తూత్తుకుడి ఎంపీ కనిమొళి సీనియర్ నేత శక్తివేల్ ఇంటికి వెళ్ళి ఆయనను ఆప్యాయంగా పలకరించి నగదు, కొత్త దుస్తులను అందజేశారు. అదే సమయంలో కనిమొళి తన సోదరుడైన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఫోన్ చేసి శక్తివేల్‌తో మాట్లాడించారు. స్టాలిన్ ఆయనతో మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి సేవలందించిన శక్తివేల్ లాంటి నాయకులవల్లే పార్టీ ఉన్నతస్థితికి చేరిందని పేర్కొన్నారు. శక్తివేల్ చికిత్సకు అయ్యే ఖర్చు పార్టీ స్థానిక శాఖ భరిస్తుందని కూడా తెలిపారు. ఈ విషయమై స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం వెలువరిస్తూ పార్టీ ఆవిర్భావం నుండి ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా డీఎంకే రంగు అంచుతో కూడిన ధోవతి, తువ్వాలు ధరించి, తన గుండెపై అన్నాదురై, కరుణానిధి బొమ్మలను పచ్చబొట్టుగా పొడిపించుకుని పార్టీకి సేవలందించిన శక్తివేల్ లాంటి క్రమశిక్షణ కలిగిన నేతల వల్లే పార్టీ నేడే ఉన్నతస్థితికి చేరిందని పేర్కొన్నారు.

క్యాన్సర్ కేర్ సెంటర్‌కు స్థలం విరాళం



స్థల పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

పెరంబూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఊత్తుకోట సమీపంలో ఏర్పాటుచేసే 'జైన్ సోహన్ కాన్వార్ మంగిలాల్ బేటర్ ఆర్ఎండీ పల్లియేటివ్ కేర్ హాస్పిటల్‌'కు సోహన్ కాన్వార్ బేట్ చారిటబుల్ ట్రస్ట్ అర ఎకరా స్థలాన్ని విరాళంగా అందజేసింది. చెట్‌పేట్‌లోని లేడి ఆండాళ్ స్కూల్ ఆడిటోరియంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఆర్ఎండీ పైన్ అండ్ పల్లియేటివ్ కేర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ రెఫూళికా శ్రీధర్‌కు స్థలానికి సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ... తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేలాది కంటి వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు దివ్యాంగ విద్యార్థులకు విద్యా సహాయాలు అందిస్తున్నామన్నారు. క్యాన్సర్ రోగులకు చికిత్స, బస వసతి కల్పించేలా ఏర్పాటుచేయనున్న ఈ కేర్ సెంటర్‌కు దాతలు, సమాజ శ్రేయోభిలాషులు చేయూత అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

యువతకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న గవర్నర్ రవి

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అందరికీ విద్య జాతి నిర్మాణంపై శక్తివంతమైన దృష్టితో పని చేస్తున్న 'ది గుడ్ డీడ్స్' క్లబ్ 2వ ఎడిషన్ ప్రారంభోత్సవంలో భాగంగా పలువురు పేద యువతకు ఆర్థిక సాయం అందించారు. దాతృత్వం, సాంస్కృతిక సహకారం, అర్థవంతమైన నెట్‌వర్కింగ్ మిళితం చేసే నెలవారీ కార్యక్రమాలకు ప్రసిద్ధి చెందిన ఈ క్లబ్, 2వ ఎడిషన్ కార్యక్రమానికి గవర్నర్ ఆర్ఎన్ రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదే విధంగా పద్మభూషణ్ నల్లి కుప్పుస్వామి చెట్టి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్లబ్ తరపున ఆర్థికంగా వెనుకబడిన యువతకు పూర్తి విద్య, బోర్డింగ్, పోలీసు శిక్షణ కోసం నిధులు సమకూర్చేందుకు వల్లమై ట్రస్టుకు రూ. 5 లక్షలు అందించారు. అదే విధంగా ఐటీలో ఉన్నత విద్యాభ్యాసం కోసం ప్రయత్నిస్తున్న హైత్రా మయూరకు రూ. లక్ష అందచేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు అప్సర రెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ సిందూర అరవింద్ తదితరులు కూడా పాల్గొన్నారు.



పళని దండాయుధపాణి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సింగపూరు హోంశాఖ మంత్రి కాశీ విశ్వనాథన్ షణ్ముగం

మద్రాస్ విశ్వవిద్యాలయంలో 'భువనచంద్ర సాహితీ సాగరం'పై సదస్సు

● పత్ర సమర్పణకు ఆహ్వానం



సమాచారపత్ర ఆవిష్కరణలో ప్రముఖులు

చెన్నై,జూలై14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ రచయిత భువనచంద్ర సాహితీ సాగరంపై మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 28, 29 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. 'భువనచంద్ర సాహితీ సాగరం - సృజనాత్మకత హరివిల్లు' పేరుతో వర్శిటీ మెరీనా ఆవరణలోని రజతోత్సవ ప్రాంగణంలో జరుగనున్న ఈ సదస్సుకు పత్ర సమర్పణ కోసం ఔత్సాహికులను ఆహ్వానిస్తున్నట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు పేర్కొన్నారు. ఈ మేరకు సాహితీ సదస్సు సమాచార పత్రాన్ని సోమవారం ఆచార్య విస్తాలి, జనని వ్యవస్థాపకులు గుడిమెట్ల చెన్నయ్య, ఆచార్య ఎల్బీ శంకరరావు, లింగంనేని సుజాత, డాక్టర్ తిరుమల ఆముక్తమాల్యద, డాక్టర్ ఎలిజబెత్ జయకుమార్, ఎంఆర్ సుబ్రమణ్యం, నాగేశ్వరరావు, డాక్టర్ పాండురంగం కాళియప్ప, డాక్టర్ మాడా శంకరబాబు తదితరులు ఆవిష్కరించారు. భువనచంద్ర బహుముఖ సాహితీ కృషిని సమగ్రంగా పరిశీలించడమే ప్రధాన లక్ష్యంగా ఈ సదస్సు జరుగనుంది. ఈ సదస్సులో పత్ర సమర్పణ చేయాలనుకునే ఔత్సాహికులు వివరాల కోసం డాక్టర్ పాండురంగం కాళియప్ప (97018 69674), డాక్టర్ మాడా శంకరబాబు (720068 5477)లను సంప్రదించవచ్చు.

వాననీటి కాల్వల్లో మట్టి తొలగింపునకు కొత్త యంత్రం

● ప్రారంభించిన మేయర్ ప్రియ



కొత్త యంత్రం పనితీరు పరిశీలిస్తున్న మేయర్ ఆర్. ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వాననీటి కాల్వలలో పేరుకుపోయిన మట్టిని తొలగించేందుకు రోబో సహిత యంత్రాన్ని మేయర్ ఆర్.ప్రియా ప్రారంభించారు. రాయపురం జోన్ ఈవీకేఎస్ సంపత్ రోడ్డులో కొత్త యంత్రం 'సూపర్ సక్కర్' పనితీరు ఆమె పరిశీలించారు. ఈ యంత్రం ద్వారా వాననీటి కాలువలో రోబో ప్రవేశించి ఆ కాలువలో ఉన్న మట్టి పరిమాణాన్ని యంత్రం వద్దనున్న ఎల్ఈడీ స్క్రీన్‌పై చూపిస్తుంది. ఆ తర్వాత ఈ యంత్రం ద్వారా ఆ మట్టిని సులువుగా తొలగించగలుగుతారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ జే కుమారగురుబరన్ పాల్గొన్నారు.

'భోజనం పెడతాం... కానీ ఓటు మాత్రం అడగొద్దంటున్నారు సర్'

పార్టీ కార్యకర్త మాటలకు నయినార్ దిగ్భ్రాంతి



బూత్‌కమిటీ సమావేశంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

పెరంబూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): 'సార్! ఓటర్లంతా, బాబూ మీకు కడుపారా భోజనం పెడతాం... కానీ దయచేసి ఓటు మాత్రం అడగొద్దు... ఓటు మాత్రం వేయం' అటున్నారు' అంటూ ఓ పార్టీ సీనియర్ కార్యకర్త చెప్పిన మాటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విరుదునగర్ నందిమర వీధిలో పార్టీ బూత్‌కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో బూత్ కమిటీ సభ్యులు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని, ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో పార్టీ సభ్యత్వాన్ని ముమ్మరం చేయాలని, అదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం ప్రజలకు తెలపాలని, పార్టీ ముద్రించే కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. ఆ సందర్భంగా పార్టీ కార్యకర్త ఒకరు మాట్లాడుతూ, తాను వెళ్ళిన ప్రతి ఇంటా భోజనం పెడతాం కాని ఓటు మాత్రం అడగొద్దంటున్నారని చెప్పటంతో నయినార్ నాగేంద్రన్ దిగ్భ్రాంతికి గురయ్యారు. పార్టీ పట్ల ప్రజాదరణ పెరుగుతోందని, కనుకనే బీజేపీ కార్యకర్తలకు ఓటర్లు భోజనం పెడతామని ముందుకు వస్తున్నారని, మరికొద్ది రోజులు గడిస్తే వారిలో మానసిక పరివర్తన కలిగి బీజేపీకి ఓటేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని అన్నారు.


బైరెడ్డి శబరి

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జూలై14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ బైరెడ్డి శబరి, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, కర్ణాటక మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు.

శంకర్‌రెడ్డి ఇన్‌చార్జి కాదు: ఎమ్మెల్యే

సత్యవేడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్ఠానం సత్యవేడుకు నూతనంగా నియమించిన కూరపాటి శంకర్‌రెడ్డి నియోజకవర్గానికి ఇన్‌ఛార్జి కాదని, ఆయన కేవలం పార్టీ ప్రోగ్రామ్స్‌కో ఆర్డినేటర్ మాత్రమేనని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. ఈ మేరకు నియామక పత్రంలో స్పష్టంగా ఉందన్నారు. సత్యవేడులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శంకర్‌రెడ్డిని నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యే స్థానంలో ఎవరినీ ఇన్‌చార్జిగా నియమించలేరన్నారు. శంకర్‌రెడ్డి తనకు మిత్రుడు, సన్నిహితుడంటూనే.. కూటమిలోని నాయకులను, కార్యకర్తలందరినీ కలుపుకొంటూ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యేను వదిలేసి తిరిగితే ఎవరూ సహకరించరన్నారు. నియోజకవర్గానికి వస్తూనే ఫ్లెక్సీలు, అంగబలంతో బలప్రదర్శన చేయడం దేనికోసమన్నారు. ఆయనకు అధికారులు ఎస్కార్ట్‌తో స్వాగతం పలకడం, సెల్యూట్‌లు కొట్టడం ఎందుకని పోలీసులను ప్రశ్నించారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. అధికారులను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

వడ్డీ సహా రూ.20 లక్షలు ఎల్ఐసీకి జమ

నాయుడుపేట/టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎల్ఐసీలో ఒకరి బీమా పాలసీకి సంబంధించి మరొకరి ఖాతాకు 19,87,500 రూపాయలు జమ అయిన ఘటనలో అధికారులు విచారించారు. ఈ మేరకు 9 శాతం వడ్డీతో పాటు ఆ వ్యక్తి నుంచి సోమవారం ఎల్ఐసీకి రూ.20 లక్షలు జమ చేయించారు. కాగా, రికార్డులు తారుమారు చేసిన అధికారులు.. బాధ్యులైన వ్యక్తి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోనున్నారో అంతుపట్టడం లేదు. ఇంత జరిగినా పోలీసులకూ ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.43 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,193

తలనీలాలు సమర్పించినవారు: 33,298



ప్రోగ్రెస్ రిపోర్ట్

వెంకటగిరి తెరమీదకు కురుగొండ్ల రామకృష్ణ వారసురాలు వచ్చారని 2024లో అంతా అనుకున్నారు. ఆయన కూడా కుమార్తెను నడిపించే బాధ్యత తీసుకున్నారు. అయితే రాజకీయ పరిస్థితుల వల్ల అనూహ్యంగా మళ్లీ రామకృష్ణకే టికెట్ ప్రకటించడంతో మూడోసారి ఆయన వెంకటగిరి ఎమ్మెల్యే అయ్యారు. రోజూ ఉదయం 6 నుంచీ అర్ధరాత్రి దాకా నియోజకవర్గంలో పర్యటిస్తూనే వుంటారు. సమస్యలపై వచ్చిన ప్రజలను ఏ పార్టీ అని అడగరు. సమస్య మాత్రమే అడిగి వేగంగా స్పందిస్తారు. పని పూర్తయిందా లేదా అని ఫాలోఅప్ కూడా చేస్తారు. వెనుకబడిన వెంకటగిరి నియోజకవర్గం అభివృద్ధికి ఆయన ఈ ఏడాదిలో ఏం చేశారు? ఏం చేయలేకపోయారు? ఇంకా చేయాల్సినవి ఏమిటి? మలి ఏడాది లక్ష్యాలుగా ఏవి నిర్దేశించుకున్నారు.. ఈ అంశాల సమాహారం...

- కథనం, ఇంటర్వ్యూ : తిరుపతి, ఆంధ్రజ్యోతి



వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ఏడాదిలో ఏం చేశారు?

పరిశ్రమలపైనే దృష్టి

- రూ. 560 కోట్లతో జల్‌జీవన్ మిషన్ ● వెంకటగిరిలో వంద పడకల ఆస్పత్రి...
- డయాలసిస్, ట్రామా కేర్ సెంటర్లకు ప్రతిపాదన
- ఏడాదిలో ఆల్తూరుపాడు, టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేయిస్తా!

వంద కోట్లతో అభివృద్ధి పనులు :

నియోజకవర్గంలో ఏడాది కాలంలో ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఉపాధి హామీ, ఆర్ డబ్ల్యుఎస్ తదితర శాఖల ద్వారా సుమారు రూ. వంద కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. పది శాతం పనులు పురోగతిలో వున్నాయి.



బాలాయపల్లి మండలం కడగుంట గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు



రాపూరు మండలం లక్ష్మీపురంలో నిర్మించిన సీసీ రోడ్డు



కలువాయి వెంకయ్య స్వామి గుడి వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

ఆర్ అండ్ బీ పనులు:

వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల పరిధిలో రూ. 5.81 కోట్లు, కలువాయి మండలంలో రూ. 4.75 కోట్లు, సైదాపురం మండలంలో రూ. 47.46 కోట్లు, రాపూరు మండలంలో రూ. 1.16 కోట్లు చొప్పున మొత్తం రూ. 59.16 కోట్లతో రోడ్ల విస్తరణ, అభివృద్ధి, మరమ్మతు పనులు జరిగాయి.

ఇరిగేషన్ పరిధిలో :

ఎస్‌డీఎంఎఫ్ కింద రూ. 50 లక్షలతో 6 పనులు, ఎఫ్‌డీఆర్-2024 కింద రూ. 9.85 కోట్లతో 156 పనులు, ఓ అండ్ పి కింద రూ. 42 లక్షలతో 15 పనులు చొప్పున మొత్తం రూ. 10.77 కోట్లతో 177 పనులు చేపట్టడం జరిగింది. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారా రూ. 1.61 కోట్లతో 237 పనులు జరిగాయి.

● పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 18.82 కోట్లతో 318 పనులు చేపట్టారు. ● జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 9.06 కోట్లతో 3822 పనులు చేపట్టారు.



మరమ్మతుల అనంతరం బాగుపడిన రాపూరు మండలం మద్దెలమడుగు నుంచి గూడూరు వెళ్లే రోడ్డు



డక్కిలిలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం



వెంకటగిరి-యాతలూరు మార్గంలో నిర్మించిన తారు రోడ్డు

పేరు: కురుగొండ్ల రామకృష్ణ (63)
భార్య: సింధు, కుమార్తె: లక్ష్మీ సాయి ప్రియ
స్వస్థలం: పాతనాల పాడు, డక్కిలి మండలం

ఎమ్మెల్యే ఏమంటున్నారంటే..

? నెల్లూరు జిల్లా నుంచి విడిపోయి తిరుపతిలో సగం కలిసిన వెంకటగిరి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడే ఉంది. ఈ విషయంలో మీరు చేస్తున్న ప్రయత్నాలు ఏమిటి?

! వెంకటగిరి నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలన్నింటినీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాను. ఇరిగేషన్ శాఖకు సంబంధించి తెలుగుగంగ ప్రాజెక్టులో చెన్నై కెనాల్ నుంచీ నాలుగు చోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు అవసరాన్ని సీఎంకు వివరించి ప్రతిపాదనలు కూడా అందజేశా. చారిత్రక ప్రాధాన్యత కలిగిన వెంకటగిరి మున్సిపల్ పట్టణంలో ప్రస్తుతమున్న ప్రభుత్వాస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచాలని కోరా. అలాగే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ సెంటర్, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కూడా సీఎంకు వివరించా. జల్‌జీవన్ మిషన్ కింద వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లోని ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేసే విధంగా రూ. 560 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం.

? వెంకటగిరి నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. మీరు చేస్తున్న కృషి ఏమిటి?

! పెద్ద సంఖ్యలో ఇక్కడ ప్రభుత్వ భూములు అందుబాటులో వున్నాయి. వెంకటగిరి మండలం కుర్తేగుంటలో 1500 ఎకరాల ప్రభుత్వ భూమి వుంది. అలాగే రాపూరు మండలంలో ఏకంగా 6 వేల ఎకరాల రెవిన్యూ అటవీ భూములున్నాయి. ఈ భూముల్లో సెజ్ లేదా పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేయాలని సీఎంను కోరాం.

సొంత నిధులతో పోలేరమ్మ ఆర్చి



వెంకటగిరి అంటే గుర్తొచ్చేది పోలేరమ్మ దేవత. ఏటా వైభవంగా జరిగే పోలేరమ్మ జాతరకు దేశవిదేశాల నుంచీ భక్తులు పోటెత్తి వస్తారు. వెంకటగిరిలో అడుగుపెట్టగానే పట్టణ వైభవం, పోలేరమ్మ గుర్తుకు వచ్చేలా కనిపించాలనే ఉద్దేశ్యంతో సొంత నిధులు రూ. 50 లక్షలు వెచ్చించి ఆర్చి నిర్మాణం ప్రారంభించా. పనులు వేగంగా జరుగుతున్నాయి.

రెండో ఏడాది లక్ష్యాలు

- రెండవ ఏడాది ముగిసేలోపు ఆల్తూరుపాడు రిజర్వాయర్ మంజూరు చేయిస్తా. రూ.768 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. మంజూరయ్యే దశలో వుంది.
- జరీ, చేనేత పరిశ్రమకు ఆయువుపట్టులాంటి వెంకటగిరిలో వేలాది మంది నేత కార్మికులున్న కారణంగా వెంకటగిరిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయిస్తా. ఇప్పటికే సీఎం చంద్రబాబును కలసి ప్రతిపాదనలు అందజేశా.

ఎమ్మెల్యే ముందున్న సవాళ్లు

- అలపలేరు డ్యామ్ ఆధునీకరణ ● వెంకటగిరిలో ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు
- కలువాయి చెరువు ఆధునీకరణ ● తెలుగు గంగ బ్రాంచి కెనాల్స్ నిర్మాణం
- జౌళి పరిశ్రమ ఏర్పాటుకు పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీ
- వెంకటగిరి - కోడూరు రోడ్డు పనులు పూర్తి చేయడం



నాయుడుపేటలో చోరీకి గురైన బంగారు నగలు రికవరీ చేసిన పోలీసులు

పగలే ఇళ్లలో చొరబడి..!

- అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు
- 416 గ్రాముల బంగారు నగలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 14(ఆంధ్రజ్యోతి): పగటిపూటే ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడే అంతర్రాష్ట్ర నిందితుడు చందక మణికంఠను నాయుడుపేట పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.37.44 లక్షల విలువ చేసే 416 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సోమవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్థనరాజు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. పార్వతీపురం జిల్లాకు చెందిన చందక మణికంఠ డిగ్రీ వరకు బాగా చదివాడు. ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. కష్టపడి పనిచేయడం ఇష్టంలేక ఈజీమనీకి అలవాటు పడ్డాడు. తోటి స్నేహితులతో కలిసి మద్యానికి బానిసయ్యాడు. జీవితాన్ని ఎంజాయ్ చేయాలని భావించి పాత నేరస్తులతో కలసి దొంగతనాలకు దిగాడు. గతంలో జైలులో ఉండొచ్చిన వారితో చేతులు కలిపాడు. దొంగతనాల్లో ప్రావీణ్యం పొందాడు. ఈ క్రమంలో పార్వతీపురానికి చెందిన మహిళతో వివాహమైంది. పిల్లలు లేరు. విశాఖ పరిధిలోని మువ్వలపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో మూడు ఇంటి దొంగతనాలు చేశాడు. ద్వారకాపురం స్టేషన్ పరిధిలో మరో మూడు కన్నాలేసి నేరాలకు పాల్పడ్డాడు. ఈ కేసుల్లో ఇతడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా, బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇతడిపై విశాఖ పోలీసులు సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేశారు. తాజాగా తడ, నాయుడుపేట, శ్రీసిటీ, వరదయ్యపాలెం పరిధిలో పలు చోట్ల దొంగతనాలకు పాల్పడగా, కేసులు నమోదయ్యాయి. తాజాగా నాయుడుపేట పరిధిలోని ముగాంబిక దేవాలయం వీధిలోని గంగినేని హరీంద్ర ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డాడు. 416 గ్రాముల బంగారు నగలు, అపహరించుకుని పరారయ్యాడు. నాయుడుపేట అర్బన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు, సీఐ ఎం.బాబి, పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి కదలికలు గుర్తించి పట్టుకున్నారు. ఇప్పటి వరకు మణికంఠపై 14 కేసులు ఉన్నాయి. నిందితుడ్ని అరెస్టు చేసి చోరీ సొత్తు రికవరీలో ప్రతిభ కనపరచిన నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ రాజు, కానిస్టేబుళ్లు దయాకర్, భానుతేజ, వెంకటేశ్వర్లు, డ్రైవర్ సుబ్రహ్మణ్యంను ఎస్పీ అభినందించి రివార్డులు అందచేశారు.

భూ సమస్యలు పరిష్కరించండి మహాప్రభో..!

అధికారులతో అర్జీదారుల మొర

పీజీఆర్ఎస్‌కు 301 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14(ఆంధ్రజ్యోతి): 'భూ సమస్యలు పరిష్కరించమని చాలా వారాలుగా తిరుగుతున్నాం. పట్టించుకోవడం లేదు. వాటిపై దృష్టి పెట్టండి మహాప్రభో' అంటూ పలువురు అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన ప్రజలతో కలెక్టరేట్ కిక్కిరిసింది. మొత్తం 301 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు 136 వచ్చాయి. వెంటనే పరిష్కరించాలని జేసీ శుభం బన్సల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

పొదుపు డబ్బులు ఆర్పీ స్వాహా చేసింది



16ఏళ్లుగా మేము పొదుపు సంఘంలో సభ్యులుగా ఉన్నాం. గత ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది జూన్ వరకు చెల్లించిన పొదుపు సొమ్ము బ్యాంకులో జమకాలేదు. ఆర్పీ లతకు డబ్బు ఇస్తే ఆమె బ్యాంకులో కట్టి రసీదు తెచ్చి ఇచ్చేది. ఇటీవల మా వద్ద ఉన్న సంఘం పుస్తకాలు, బ్యాంకు రసీదులు ఆమె తీసుకుంది. బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ చూడగా మా గ్రూపునకు సంబంధించి రూ.6.80లక్షలు జమ కాలేదని బ్యాంకు అధికారులు తెలిపారు. దీనిపై విచారించగా నేను ఒకదాన్నే సొమ్ము స్వాహా చేయలేదు. మెప్మా అధికారులు, సిబ్బందికి వాటాలు ఇచ్చానని చెప్పింది. విచారణ జరిపి న్యాయం చేయండి.

- భాగ్యలక్ష్మి సంఘం సభ్యులు, కైకాల చెరువు, తిరుపతి

మా పిల్లలకు చదువు దూరం చేయొద్దు



కేవీబీపురం మండలం పాతపాళెం హరిజనవాడలో 30 ఏళ్లుగా ప్రాథమిక పాఠశాల ఉందని, 40 మంది పిల్లలు చదువుకుంటున్నారని, ప్రస్తుతం 3, 4, 5 తరగతుల విద్యార్థులను పక్క ఊరు స్కూల్‌కు పంపించాలని ఉపాధ్యాయులు ఒత్తిడి చేస్తున్నారని గ్రామస్తులు డీఆర్వో నరసింహులు దృష్టికి తీసుకెళ్లారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలను తరలిస్తే తమ పిల్లలకు చదువు దూరమవుతుందని తెలిపారు. అలాగే ఏర్పేడు మండలం పల్లంపేట పాఠశాల విద్యార్థులను 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో పాఠశాలకు తరలించాలని అధికారులు పూనుకోవడం సబబు కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీఐటీయూ నేత సుబ్రహ్మణ్యం అన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ చొరవ తీసుకుని పాఠశాలల తరలింపును అడ్డుకోవాలని కోరారు.

కలపాడు భూములు పంచాలి



వెంకటగిరి నియోజకవర్గం కలపాడులో ఉన్న ప్రభుత్వ భూమిని దళిత, గిరిజనులకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కలపాడు పంచాయతీ పరిధిలో 1,400 ఎకరాలకు పైగా ప్రభుత్వ మేత పోరంబోకు భూములు ఉన్నాయని, వాటిని గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు రెండు ఎకరాల చొప్పున పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంగయ్య, కృష్ణయ్య, లోకేష్, చెంచుకుమార్, సమరం పాల్గొన్నారు.

రేషన్‌కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తించలేదు



తమకు రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తించడంలేదని సత్యవేడు మండలం పేరడం గ్రామం, ఎస్టీకాలనీకి చెందిన వెంకటరత్నం, వీరమ్మ తదితరులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కూలీనాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఆస్తులు లేవని, పథకాలు ఇస్తే ఆసరాగా ఉంటుందని వేడుకున్నారు.

జాతీయ రహదారి పేరుతో చెరువులు పూడ్చేస్తున్నారు

జాతీయ రహదారుల విస్తరణ పేరుతో తూకివాకం, దామినేడు, ఓటేరు, పేరూరు చెరువులను పూడ్చివేస్తున్నారని జైహింద్ స్వామీ పార్టీ నేత నీలకంఠ అన్నారు. చెరువులు ఉన్న ప్రాంతాల్లో నీటి వనరులను రక్షిస్తూ ఫ్లైఓవర్ నిర్మించాలని డీఆర్వో నరసింహులు దృష్టికి తీసుకెళ్లారు.





చిట్టెమ్మ (ఫైల్), వడమంచి శ్రీను (ఫైల్)

ఆ 9 మంది మృతుల్లో ఐదుగురు శ్రీకాళహస్తివారే

- మామిడి కోతలకు వెళ్లి విగతజీవులుగా మారిన గిరిజనులు
- మృతదేహాల రాకతో విషాదం

రైల్వేకోడూరు/శ్రీకాళహస్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వారంతా నిరుపేద గిరిజనులు. మామిడి సీజన్‌లో కాయల కోతలకు వెళుతుంటారు. అలా ఆదివారం అన్నమయ్య జిల్లా రాజంపేటలోని ఇసుకపల్లెలో మామిడి కోతకు వెళ్లారు. పని ముగించుకుని లారీలో కాయలను వేసుకుని వస్తుండగా పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద ఆదివారం రాత్రి లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో 9 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో నలుగురు రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట.. మిగిలిన ఐదుగురు శ్రీకాళహస్తి మండలం కలవగుంట, గుండ్లపల్లి, చుక్కలనిడిగల్లు ఎస్టీ కాలనీలకు చెందిన వారని తెలిసింది. వీరి మృతదేహాలు సోమవారం ఆయా కాలనీలకు చేరడంతో విషాదం నెలకొంది. శెట్టిగుంటతో పాటు శ్రీకాళహస్తి ప్రాంతంలోని వీరంతా బంధువులే. మృతి చెందిన వారిని గజ్జల గంగమ్మ, చిట్టెమ్మ, రాధమ్మ, జాని, వడమంచి శ్రీను, గజ్జల సుబ్బరత్న, గజ్జల దుర్గయ్య దంపతులుగా గుర్తించారు. వీరిలో వడమంచి శ్రీనుది శ్రీకాళహస్తి మండలం గుండ్లపల్లి. చిట్టెమ్మది కలవగుంట ఎస్టీకాలనీ. వీరి మృతదేహాలకు సోమవారం బొజ్జల బృందమ్మ నివాళులర్పించారు. మృతుల కుటుంబీకులకు ఆర్థికసాయం చేశారు. మిగతా ముగ్గురి విషయంలో స్పష్టత లేదు. కాగా, రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్షలు పూర్తయి అంబులెన్సుల్లో ఆయా గ్రామాలకు మృతదేహాలను చేర్చారు.

అధిక లోడ్డే కారణం

ప్రమాదానికి గురైంది ఆరు టైర్ల లారీ. ఈ లారీలో సాధారణంగా 6 టన్నులే వేయాలి. దీనికన్నా ఎక్కువగా వేశారు. ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసి ఆ తర్వాత ముందు వచ్చే కారును తప్పించాలని చూడటంతో బోల్తాపడిందని స్థానికులు స్థానికులు చెబుతున్నారు.